# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రీయ బాల్ పురస్కారాలు చిన్నారులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ యువత.. దేశ నిర్మాణంలో కేంద్రంగా ఉండేలా నూతన విధానాలను రూపొందిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ వికసిత్ భారత్ లక్ష్యంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు.
- ❖ ఐటీ, టెలికాం రంగాల్లో పెట్టుబడుల విధానాన్ని సరళీకరించామని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

========================

వీర్ బాల్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలో ఈరోజు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను ప్రదానం చేశారు. 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 20 మంది చిన్నారులు అత్యుత్తమ విజయాలు ప్రదర్శించినందుకు గాను పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... ఈ పురస్కారాలు గ్రహీతలకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని, దేశవ్యాప్తంగా ఉన్న చిన్నారులకు స్ఫూర్తినిస్తాయన్నారు. అవార్డులు సాధించిన చిన్నారులు కళలు, సంస్కృతి, పర్యావరణం, ఆవిష్కరణలు, సైన్స్, టెక్నాలజీ వంటి వివిధ రంగాలలో అసాధారణ కృషి చేశారని పేర్కొన్నారు. గురు గోవింద్ సింగ్ జీ కుమారులు సాహిబ్‌జాదా బాబా జోరావర్ సింగ్ జీ, బాబా ఫతే సింగ్ జీల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, వారి అసమాన త్యాగం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

========================

వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రీయ బాల్ పురస్కార గ్రహీతలతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన.. దేశానికి గర్వకారణమైన సాహిబ్‌జాదేల ఆదర్శప్రాయమైన ధైర్యసాహసాలు, త్యాగాలను నేడు దేశం గుర్తు చేసుకుటోందన్నారు. భారతదేశ ధైర్య సాహసాలకు సంబంధించిన ఆదర్శాలను వారు ప్రతిబింబించారని పేర్కొన్నారు. యువత సాధికారతపై దృష్టి సారించి, వారిని దేశ నిర్మాణంలో కేంద్రంగా ఉంచుతూ కొత్త విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా యువత భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యం వైపు నడిపిస్తారని ప్రధానమంత్రి అన్నారు. ప్రతి రంగంలోనూ యువతకు కొత్త అవకాశాలు అందుబాటులో ఉంటున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ... దేశం ముందు అనే సిద్ధాంతాన్ని చిన్నారులు తమ జీవితాలకు మార్గదర్శక మంత్రంగా స్వీకరించాలని కోరారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే శక్తులుగా చిన్నారులను అభివర్ణించారు. సరైన అవకాశాలు, మార్గదర్శకత్వం ద్వారా చిన్నారులు అసాధ్యమైన వాటిని కూడా సుసాధ్యం చేయగలరని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. కొత్తగా అమలులోకి వచ్చిన వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం గ్రామీణ కుటుంబానికి చట్టబద్ధమైన వేతన ఉపాధి హామీని 100 రోజుల నుండి 125 రోజులకు పెంచుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు పని కల్పించకపోతే నిరుద్యోగ భృతిని కూడా అందిస్తుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ పథకం అమలులో వేతనం, పరికరాలు, ఇతర ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వ వాటాతో సహా లక్షా 51 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు అవసరం అవుతాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా 95 వేల కోట్ల రూపాయలకు పైగా ఉందని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వీసాలు కలిగి ఉన్న భారతీయ పౌరులకు అమెరికాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. వీసా నియామకాలను షెడ్యూల్ చేయడంలోను, రీషెడ్యూల్ చేయడంలోను ఇబ్బందులను ఎదుర్కొంటున్న భారత పౌరుల నుండి అనేక విజ్ఞప్తులు వచ్చాయని న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. ఈ అంశాలపై.. న్యూఢిల్లీ, వాషింగ్టన్ లోని అమెరికా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. మరోపక్క.. బంగ్లాదేశ్‌లో మైనారిటీల పరిస్థితిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి తాత్కాలిక ప్రభుత్వ హయాంలో మైనారిటీలపై 2 వేల 900 కి పైగా హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయని రణధీర్ జైస్వాల్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐటీ, టెలికాం రంగాల్లో పెట్టుబడుల విధానాన్ని సరళతరం చేశామని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఈరోజు జరిగిన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ...

దశాబ్ద కాలంగా భారత్.. అంకుర సంస్థలతో పురోగమిస్తోందని, స్పేస్ ఎకానమీలో 8వ స్థానానికి చేరుకుందని చెప్పారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 81వ ర్యాంక్ నుంచి 38వ ర్యాంక్‌కు చేరుకున్నామన్న ఆయన.. చంద్రుడిపై ప్రయోగాల్లో ఘన విజయాలు సాధించామన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో గణనీయ వృద్ధి సాధించామని జితేంద్ర సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జీవన సౌలభ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. My Gov India పోస్ట్‌ను ఒక సామాజిక మాధ్యమంలో షేర్ చేసిన ఆయన.. రాబోయే కాలంలో సంస్కరణల పథం మరింత శక్తితో కొనసాగుతుందని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో పరిపాలన ఫలితాలపై దృష్టి సారించి, సంస్కరణలతో సాగిందన్నారు. తమ ప్రభుత్వం దీర్ఘకాలిక వృద్ధిపై దృష్టి పెట్టిందని, మెరుగ్గా రూపొందించబడిన విధానాలు రోజువారీ జీవితాన్ని ఏ విధంగా మెరుగుపరుస్తాయో వెల్లడయ్యిందని ప్రధానమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానవాళికి అతిపెద్ద శత్రువు ఉగ్రవాదమే అని, ప్రతి ఒక్కరూ దానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన ఉగ్రవాద నిరోధక సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా, ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా విశేషమైన కృషి చేసిన 9 మంది NIA సిబ్బందికి  సేవా పదక్, వీర్ తా పదక్ లను అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్ లో భాగంగా తిరువనంతపురం వేదికగా మూడవ టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. భారత్ కు 113 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి గోవా, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. రేపు సాయంత్రం రాష్ట్రపతి గోవాకు బయలుదేరనున్నారు. ఈ నెల 28వ తేదీన కర్ణాటకలోని కార్వార్ హార్బర్ నుండి జలాంతర్గామిలో సముద్ర విహారం చేస్తారు. మరునాడు జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో జరిగే ఓల్ చికి శతాబ్ది ఉత్సవాలకు ద్రౌపది ముర్ము హాజరవుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా.. ఇండియన్ ఫార్మకోపోయియా కమిషన్ (IPC) పురోగతిని ఈరోజు సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =